# తలతన్నేవాడొకడైతే.....

"మూర్తి గారి నాన్నగారు వచ్చారండి. పంపమంటారా?"

తలుపు సగము తీసి తలలోనికి పెట్టి అడిగేడు బంట్రోతు

సంతకము చేయబోయే నా చెయ్యి ఆగిపోయింది. నెలల తరబడి మరమ్మత్తు చేసిన పిదప నిరాస చెంది, పని చెయ్యదని వదిలిపెట్టిన యంత్రము హఠాత్తుగా పనిచేస్తోందనే వార్త విన్నట్టు తోచింది నాకు.

"రమ్మను, యింకా ఆలస్యమెందుకు?" నా గొంతులో స్ఫురించే ఆనందానికి నాకే ఆశ్చర్యమేసింది.

వరుసగా మూడు సంవత్సరాలు నష్టములో నడిచి ఆర్థిక సంక్షోభములో మునిగిపోతుందని అనుకున్న కర్మాగారము హఠాత్తుగా లాభాలు ఆర్జిస్తోందని విన్నప్పుడు కూడా నాకు యింత ఆనందము కలగలేదు.

మూర్తి నాన్న నాకు చిన్ననాటి స్నేహితుడు. కలసి ఆడుకున్నాము, చదువుకున్నాము. గత నాలుగు సంవత్సరాలుగా అతన్ని నేను కలవలేదు. అతని ఆచూకీ తెలుసుకోవటానికి ఎన్నెన్ని ప్రయత్నాలు చేస్తున్నానో? నాలుగు సంవత్సరాల తర్వాత చిన్ననాటి స్నేహితుడిని కలుసుకోబోతున్నందుకు కాదు నా ఆనందం.

మూర్తి మా కర్మాగారములో నుంచి రాజీనామా చెయ్యకుండా పని మానివేసినప్పటి నుంచి నేను యితని గురించి వెదుకుతూనే వున్నాను. తెలిసిన చిరునామాలకెల్లా ఉత్తరాలు పంపుతూనేవున్నాను, అన్నీ బుద్ధిగా వెనక్కు వచ్చేసాయి.

"శర్మ ఏమైపోయాడురా?" ఓసారి మరో స్నేహితుడు కలిసినప్పుడు అడిగేను.

"ఏమోరా" అతను అన్నాడు." ఎక్కడ తిరుగుతున్నాడో ఏమో? పాపం శర్మ బాగా చితికిపోయాడట. రోజులు గడవటం కూడా కష్టంగా వుందట"

ఆ మాటలు నాకు బాధ కలిగించాయి. చిన్నప్పుడు కలిసిమెలసి తిరిగినవాళ్ళము

అప్పుడు ఆర్థికంగా శర్మ నా కన్నా ఓ మెట్టుపైనే వుండేవాడు.

“ఎంత చితికిపోయినా ఆ దర్జామాత్రం పోలేదురా. అదే సిల్కు లాల్చీ, అదే కారాకిళ్ళీ, గోల్డు ఫ్లేక్ సిగరెట్టు.....”

నిజమే నాకూ అలాగే అనిపించింది. నాలుగు సంవత్సరాలు క్రితం అతన్ని కలసినప్పుడు శర్మ తన కొడుకు ఉద్యోగం కొరకు వచ్చాడు అప్పుడు.

“నీతో పనివుండి వచ్చానురా” తోటలోని కుర్చీలో కూలబడుతూ అన్నాడు శర్మ. “మావాడు ఇంజనీరింగ్ పాసయ్యాడు. వాడిని నీ దగ్గర చేర్చాలని వుందిరా నాకు”

ఓ నిముషము నేనేమీ అనలేదు. నాలుగు కర్మాగారాలకు అధిపతినైన నాకు శర్మ కొడుకుకు ఉద్యోగం యివ్వటం ఏమీ అంతకష్టం కాదు.

“ఇప్పుడు ఇంజనీర్ ఉద్యోగాలు ఏమీ ఖాళీ వున్నట్లు లేవే” కాస్త బెట్టు చెయ్యాలనే ఉద్దేశంతో అన్నాను.

“అలా అంటే ఎలాగరా?” శర్మ దీనంగా అన్నాడు. “వాడి కష్టంమీదే నేను బ్రతకాలిరా” ఖాళీ అయిపోయిన టీ కప్పు టీపాయ్‌మీద పెట్టి అన్నాడు శర్మ.

“ఒక ఏడాది వరకూ లాభంలేదురా” కాళ్ళ దగ్గరకు వచ్చిన వాళ్లని వొంచి నా షరతులకు ఒప్పించటం నా పద్ధతి. అత్యవసరంలో వున్నవాళ్ళు ఏ షరతలకైనా ఒప్పుకుంటారు కదా!

“కొత్త కర్మాగారం ఒకటి నెలకొల్పటానికి ప్రయత్నిస్తున్నానురా అందులో చూద్దాంలే”

“సేద్యానికి నీళ్లడిగితే చెరువు తవ్విస్తున్నాను, నీళ్ళు నిండగానే యిస్తానులే అని మాఘంలో ఎవరో చెప్పారట. అలా వున్నాయి నీమాటలు”

నాకు నోటమాటరాలేదు. ఒకరి మొహం ఒకరు చూస్తూ కూర్చున్నాము. సూర్యుడు యిచ్చిన నీరెండ అనే టీ త్రాగిన ప్రపంచము చీకటిలోకి అడుగులు వేస్తోంది.

"పోనీ లేరా మరోమార్గం చూస్తాను" కుర్చీలోంచి లేస్తూ అన్నాడు శర్మ.

"నిన్ను చూస్తే జాలివేస్తుందిరా" నేను విచారం నటిస్తూ అన్నాను. "నువ్వు అడుగుతున్నావు కనుక ఓ పనిచేస్తానురా. ఏదైనా ఖాళీ వచ్చినంతవరకూ ఇంజనీర్‌గా శిక్షణయిస్తాను. జీతం ఎంతో కొంత యిస్తానులే. కానీ ఓ షరతు"

"ఏమిటది?" అనుకోక వచ్చిన చిరుగాలికి ప్రసన్నుడైన శర్మ అడిగాడు.

"ఏమీ లేదులే. మీ అబ్బాయి ఐదు సంవత్సరాలు మా కర్మాగారములోనే పని చేస్తాడనీ, ఏ కారణం వల్లనైనా పనిమానివేస్తే సంవత్సరకాలపు జీతము ,అతని శిక్షణ కోసం ఖర్చుచేసే డబ్బు నష్టపరిహారముగా చెల్లిస్తాడని బాండ్ వ్రాసివ్వాలి"

"ఓ అంతేనా"! శర్మ చాలా తేలికగా నవ్వుతూ అన్నాడు. "వాడెక్కడికి పోతాడురా? మనవూరొదలి"

"అలా అనకు రెక్కలకు బలం లేకపోయినా ఈ కాలం కుర్రవాళ్ళ దృష్టి ఎప్పుడూ ఆకాశంవైపే ఎగిరిపోగలరు."

నేనన్నంత పనీ అయింది. రెండు సంవత్సరాలు పనిచేసి విదేశాల్లో కూడా శిక్షణపొంది ఉద్యోగానికి రావటం మానివేసాడుమూర్తి. మరెక్కడో మంచి ఉద్యోగం వచ్చిందట!

అప్పటినుంచీ తెలిసిన చిరునమాకల్లా నోటీసులు పంపుతూనే వున్నాను. శర్మ గురించి వెదుకుతూనే వున్నాను. ఎందుకంటే బాండు ప్రకారం మూర్తి చెల్లించవల్సిన డబ్బుకి శర్మ హామీయిచ్చాడు.

ఇప్పుడు దొరికాడు. హాయిగా నిట్టూర్చాను. నెలల కొద్దీ ఎడారిలో నీళ్ళులేక తల్లడిల్లిపోయిన నాకు ఒయాసిస్ చేరుకున్నట్టు అనిపించింది.

"ఐతే!" నానోటీస్ అందుకునే వచ్చావన్నమాట" శర్మలోనికిరాగనే అడిగేను.

"నోటీస్ ఏమిటి"

"అదే నీ సుపుత్రుడు చెప్పా చెయ్యకుండా ఉద్యోగం నుండి పారిపోయాడుగదా?"

“ఐతే”

“వాడిమీద నేను చాలా ఖర్చుచేసాను. శిక్షణ కోసం విదేశాలకు కూడా పంపాను.”

“అయితే, ఏమిటట?” శర్మ ఒక సిగరెట్టు వెలిగించాడు. “వాడు కనీసం ఐదేళ్ళు పనిచెయ్యకపోతే నష్టపరిహారం చెల్లిస్తాననే బాండుమీద నువ్వు సంతకం పెట్టావు. గుర్తుందా?”

శర్మ నా మాటలు వినిపించుకున్నట్టు లేదు. కాలుమీద కాలువేసుకొని, పొగపీలుస్తున్నాడు నాకు కోపం వచ్చింది.

“నువ్వు రెండులక్షలు చెల్లించాలి తెలుసా?”

“నేనేమి చెల్లిస్తాను, నా బొంద” గట్టిగా పొగవదులుతూ అన్నాడు శర్మ “అసలే తాడూ బొంగరమూ లేనివాడిని. నిజం చెప్పాలంటే నువ్వే నాకు డబ్బు చెల్లించాలి.”

“ఎందుకు?”

“ఎందుకా? నువ్వు మా అబ్బాయి చేతబాండు వ్రాయించటం చేతనే కదా వాడు చెప్పకుండా పారిపోయాడు? యిక్కడ ఉద్యోగం చేసేటప్పుడు ఏవో నాల్గు డబ్బులు పడేసేవాడు కానీ యిప్పుడు....”

నేను రెప్పవాల్చకుండా శర్మని చూస్తూ వుండిపోయాను.

“నీ బాండు ధర్మమా అనివాడు పారిపోయాడు. ఎక్కడ ఉద్యోగం చేస్తున్నాడో తెలీదు. డబ్బులు లేవు. అందుకే నీదగ్గర తేల్చుకుందామనే వచ్చాను”

“ఏమిటి?”

“నా ఖర్చులకు నువ్వు డబ్బులిస్తే సరే లేకపోతే నా జీవనాధారము లేకుండా చేసినందుకు నీవే కారకుడివి కనుక నాకు నష్టపరిహారం చెల్లించాలని కోర్టుకెక్కుతాను”

నా బుర్ర తిరిగిపోయింది. తలతన్నేవాడొకడైతే తాడి తన్నేవాడు వేరొకడన్నది గుర్తుకొచ్చిందినాకు.

రాఘవీస్ కోకిల ఏప్రిల్ 1996